మున్సిపల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆదిల్ షరీఫ్ తదితరులు

అబిడ్స్: మున్సిపల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు జీహెచ్‌ఎంసీకి సంబంధించిన మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ కృషి చేస్తుందని ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ పేర్కొన్నారు. నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆదిల్ షరీఫ్ జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేయాలని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో సైతం జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు ప్రాణాలను అడ్డం పెట్టి విధులు నిర్వహించారన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరికీ రూ.26 వేల వేతనం ఇవ్వాలన్నారు. పాతపెన్షన్ స్కీమ్‌ను యధావిధిగా కొనసాగించాలన్నారు. జీహెచ్‌ఎంసీ ఉద్యోగులందరికీ హెల్త్‌కార్డులు, రూ.10 లక్షల వైద్య బీమా ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాగన్న గౌడ్, విజయ్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలో కలుషిత నీటి సరఫరా

- పట్టించుకోని జలమండలి అధికారులు
- సమస్య పరిష్కరించాలంటున్న స్థానికులు

అనారోగ్యానికి గురవుతున్న చిన్నారులు, వృద్ధులు



చార్మినార్: జలమండలి డివిజన్–2ఏ జీఎం కార్యాలయం పరిధిలోని యాకుత్‌పురా బస్తీలలో కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోంది. కుళాయి విప్పిన అరగంట వరకు దుర్వాసనతో పాటు రంగు మారిన మురుగునీరు సరఫరా అవుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుళాయిల్లో వచ్చే కలుషిత నీటి సరఫరాతో స్థానికులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. ముఖ్యంగా యాకుత్‌పురా ఎస్సార్టీ కాలనీ, అజ్మత్‌నగర్, వాహేద్ కాలనీ, ఇమాంబాడా, రేయిన్‌బజార్ తదితర ప్రాంతాల్లో చిన్నారులు, వయోవృద్ధులు ఈ కలుషిత నీరు తాగి అస్వస్థత చెందుతున్నారు. ఈ బస్తీకి చెందిన పలువురు ఇప్పటికే స్థానికంగా ఉన్న ప్రైవేట్ వైద్యులను సంప్రదించి చికిత్సలు పొందుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టైఫాయిడ్, వాంతులు, విరేచనాలు, జ్వరంతో బాధపడుతూ రోజు వారీ కాలం వెళ్లదీస్తున్నారు. తాము రోజూ బహిరంగ మార్కెట్‌లో నీళ్ల క్యాన్‌లను కొనలేని పరిస్థితిల్లో ఉన్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొంతకాలంగా..

కొంతకాలంగా కలుషిత నీటిని తాగలేక పలు ఇబ్బందులకు గురవుతున్నా.. సంబంధిత జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత జలమండలి అధికారులకు వివరించినా.. సకాలంలో స్పందించడం లేదంటున్నారు. కుళాయిల్లో వచ్చిన కలుషిత నీటిని వాటర్ బాటిల్స్‌లో పట్టి సంబంధిత జలమండలి అధికారులకు చూపించామని.. అయినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే ఎండలు మండిపోతున్నాయి.. నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది.. ఇటువంటి పరిస్థితుల్లో కలుషిత నీటి సరఫరా చేస్తే ఎలా..? అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్పందించి కలుషిత జలాలను అరికట్టాల్సిన అవసరం జలమండలి అధికారులపై ఉందని స్థానికులు అంటున్నారు. తమ బస్తీకి సరఫరా అయ్యే మంచినీటి పైప్‌లైన్‌లు.. డ్రైనేజీ పైప్‌లైన్లు..కలిసి పోతుండడంతో కలుషితమైన నీటి సమస్య తలెత్తుతోందని అంటున్నారు.

“ కలుషిత నీటిని అరికట్టాలి

యాకుత్‌పురాలోని పలు బస్తీల్లో కొంతకాలంగా కలుషిత నీటి సరఫరా జరుగుతున్న విషయం సంబంధిత జలమండలి అధికారులకు తెలియజేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కలుషిత నీరు తాగి ఆయా బస్తీల ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవతున్నారు. సాధ్యమైనంత వెంటనే కలుషిత నీటిని అరికట్టాలి.

– అంజదుల్లాఖాన్, ఎంబీటీ అధికార ప్రతినిధి

రూ.2.5 కోట్లతో పనులకు ఎంపీ శంకుస్థాపన

యాకుత్‌పురాలోని పలు బస్తీల్లో పురాతన మంచి నీటి కుళాయిల పైప్‌లైన్‌తో పాటు డ్రైనేజీ పైప్‌లైన్‌లను కొత్తగా మార్చడానికి ఇటీవల హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ రూ.2.5 కోట్ల నిధులతో పనులకు శంకుస్థాపన చేశారు. అంతేకాకుండా మరో రూ.12.5 కోట్ల నిధులు మంజూరు కోసం సిద్ధంగా ఉన్నాయి. కలుషిత నీటి సరఫరాను వెంటనే అరికట్టడానికి తమ వద్ద అత్యంత ఆధునాతనమైన పొల్యూషన్ అడెంటిఫైడ్ ఇక్విప్‌మెంట్ ఉంది. దీని ద్వారా వెంటనే రెక్టిఫై చేస్తున్నాం.

– ఖాదర్ మోహీనుద్దీన్, జలమండలి జీఎం, డివిజన్–2ఏ

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



కందకాలను పరిశీలిస్తున్న టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ కమిషనర్ విజయరాణి

గోల్కొండ: నిబంధనలు ఉల్లంఘించి ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం, అనుమతి లేకుండా ఇళ్లు నిర్మించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బల్దియా టౌన్‌ప్లానింగ్ ఏసీపీ విజయరాణి అన్నారు. శనివారం ఆమె కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ మహ్మద్ ఆల్‌హాజరీతో కలిసి మోతీదర్వాజా వద్ద గల అహ్మద్ కాలనీ నాలాను పరిశీలించారు. కొందరు అక్రమార్కులు నాలాను కబ్జా చేసి ఇళ్లు నిర్మిస్తున్నారని, అదే విధంగా కొత్త రోడ్డు వేయడానికి తగిన రోడ్డు వ్యర్థాలను మోతీదర్వాజా వద్ద గల కందకంలో వేసి కందకాన్ని మూసేస్తున్నారని ఉస్మాన్‌బిన్ మహ్మద్ అల్ హాజరీ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు బల్దియా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. బల్దియా కమిషనర్ ఆదేశాల మేరకు ఆమె ఆక్రమించిన నాలాను పరిశీలించారు. నాలాపై వేసిన స్లాబ్‌ను పరిశీలించి ఇది పక్కాగా కబ్జానే అని స్పష్టం చేశారు. వీటికి అనుమతి ఎలా ఇచ్చారంటూ ఆమె తనవెంట ఉన్న టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని నిలదీశారు. అనంతరం ఆమె మోతీదర్వాజా కందకాలను పరిశీలించారు. రోడ్డు తవ్విన వ్యర్థాలతో కందకాన్ని మూయడానికి కుట్రలో భాగంగా ఇలా వేస్తున్నారని ఆమె స్పష్టం చేశారు. చారిత్రక కందకం ఈపాటికే ఎంతో కబ్జాకు గురైందని మిగిలిన కందకాన్ని పరిరక్షించాల్సి బాధ్యత మనందరిపై ఉందని ఉస్మాన్ బిల్ అల్ హాజరీ అన్నారు. తాను పరిశీలించిన విషయాలను ఫైల్‌గా తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తానని ఈ సందర్భంగా టౌన్‌ప్లానింగ్ ఏసీపీ విజయరాణి తెలిపారు.

తెలుగు సినీ ఖ్యాతిని పెంచిన దిగ్గజం కె.విశ్వనాథ్



జానకి, హేమ సుందర్‌కు పురస్కారాలను అందజేస్తున్న జస్టిస్ లక్ష్మణ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలుగు సినిమా ఖ్యాతిని ఉన్నత స్థాయిలోకి తీసుకువెళ్లిన దిగ్గజ దర్శకులలో కె.విశ్వనాథ్ ఒకరని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువ కళావాహిని ఆధ్వర్యంలో కళా తపస్వీ కె.విశ్వనాథ్ జయంతి సందర్భంగా సినీ నటులు డబ్బింగ్ జానకి, హేమ సుందర్‌కు విశ్వనాథ్ విశిష్ట నటనా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి యువతరం దర్శకులు కె.విశ్వనాథ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అంతకు ముందు గాయని గాయకులు ఆలపించిన సినీ గీతాలపన ఆహూతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, దూరదర్శన్ పూర్వ సంచాలకులు మధుసుధన్ రావు, నిర్మాత ఎ.రాజ, రచయిత్రి పి.జ్యోతి, యువకళావాహిని అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలకు అనుగుణంగా విద్యా బోధన చేయాలి



వైజ్ఞానిక ప్రదర్శనలు తిలకిస్తున్న జయత్రరావు, ఐసీఏఆర్ హెడ్ శ్రీనివాస్ రావు, డాక్టర్ కృష్ణ

సంతోష్‌నగర్: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులు, నూతన పరిశోధనలకు అనుగుణంగా విద్యార్థులకు విద్యాబోధన చేయాలని శాస్త్రవేత్త ప్రొఫెసర్ డాక్టర్ వి.జయత్ర రావు అన్నారు. ఐ.ఎస్.సదన్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో శనివారం విద్యార్థులు నిర్వహించి వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి జయత్రరావుతో పాటు ఐసీఏఆర్ హెడ్ శ్రీనివాస్ రావు, కంప్యూటర్ సైన్స్ హెచ్‌ఓడీ డాక్టర్ వి.కృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరై వైజ్ఞానిక ప్రదర్శనలు తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సైన్స్ ఎగ్జిబిషన్లు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ డీస్ కె.జ్యోతి, డీఈ ఇ.దయాకర్, ప్రిన్సిపాల్ కె.పరిమళ పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలి



విద్యార్థుల నమునాలను పరిశీలిస్తున్న వెంకటేశ్



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న రామగిరి స్వారిక

గౌలిపురా: వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో ఉన్న మేధశక్తిని పెంపొందించేందుకు దోహదపతాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ అన్నారు. లాల్‌దర్వాజా ఇందిరా విద్యా నికేతన్ స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనకు వెంకటేశ్, న్యాయవాది, సూక్ష్మ కళాకారిణి రామగిరి స్వారిక హాజరై సైన్స్ ప్రదర్శనలను తిలకించి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి ఉపాధ్యాయులు ఆ దిశగా వారిని ప్రోత్సాహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీవీ నటి ప్రీతీనిగమ్, పాఠశాల ప్రిన్సిపాల్ మృగశీల, కరస్పాంటెండెంట్ ఆనంద్ సక్సేనా, కీర్తి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

సుల్తాన్‌బజార్: గురుకుల ఉపాధ్యాయ నియామకాల్లో అర్హులైన మెరిట్ అభ్యర్థులకు న్యాయం చేయాలని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ. శ్రీకాంత్, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్.శ్రీకాంత్, గురుకుల బాధిత అభ్యర్థులు ఆస్మా, సుష్మిత, మంజుల మాట్లాడుతూ..గురుకుల ఉద్యోగాలను అవరోహణ క్రమంలో కాకుండా కిందిస్థాయి ఉద్యోగాలను భర్తీ చేసిపై స్థాయి ఉద్యోగాల నియామకాలు చేపట్టకపోవడం వల్ల 4 వేల వరకు బ్యాక్‌లాగ్ పోస్టులు మిగిలిపోయే అవకాశం ఉండటంతో మెరిట్ సాధించిన అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏబీడీఎస్‌వై రాష్ట్ర అధ్యక్షుడు మల్లేష్, ఏబీవైఓ రాష్ట్ర నేత దేవర్షి గంగాజీ, పీడీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు, నగర అధ్యక్షుడు గడ్డం శ్యామ్, నగర కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ విడుదలపై హర్షం

నాంపల్లి: మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంపై తెలంగాణ యూత్ కాంగ్రెస్ హర్షం వ్యక్తం చేసింది. శనివారం గన్‌పార్కు ఎదుట తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుల స్థూపానికి పాలాభిషేకం చేశారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ..నిరుద్యోగుల జీవితాల్లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వెలుగులు నింపుతోందన్నారు.

ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం




చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలోని చెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. కమిటీ చైర్మన్ జుర్కీ సంతోషి రాణి ఆధ్వర్యంలో శనివారం ఉదయం అంకురార్పణ, పుణ్య హవచనము, అగ్నిప్రతిష్ట, ధ్వజారోహణ తదితర కార్యక్రమాలు కొనసాగాయి. అనంతరం గరుడ అల్వార్ విగ్రహ మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాతలు పర్వతాల సుప్రియ మనోజ్ కుమార్, కడారి ప్రియాంక, సందీప్, ఈవో శివ రుద్రప్ప పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



విజయనగర్‌కాలనీ: వీనుల విందు అయిన ఫ్లూట్ వాయిద్యం, వినసొంపు అయిన సంగీతం, వీణావాయిద్యం ప్రేక్షకులను అలరించాయి. జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని ఆడిటోరియం హాల్‌లో శనివారం రాత్రి ఉత్తర్ దక్షిణ్ పేరిట సురుమండల్ సంస్థ ఆధ్వర్యంలో శాస్త్రీయ సంగీత విభావరి ఘనంగా నిర్వహించారు. ఇంటర్నేషనల్ గ్రామీ అవార్డు గ్రహీత రాకేష్ చౌరాషియా, వీణా కళాకారిణి డాక్టర్ జయంతి కుమరేష్ ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. సంగీత విభావరిలో భాగంగా నిర్వహించిన వీణావాదన, జుగల్‌బందీ ఆకట్టుకున్నాయి. యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ విష్ణువర్ధన్, కళాకారులు జయచంద్రరావు, గిరిధర్ ఉడుప, ఓజాస్ ఆదియా పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట



చార్మినార్: పాతబస్తీలోని పర్యాటక ప్రాంతాలన్నీ శనివారం సందర్శకులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు చార్మినార్ కట్టడంతో పాటు మక్కా మసీదు, చౌమహల్లా ప్యాలెస్, సాలార్‌జంగ్ మ్యూజియం, జూపార్కు తదితర పర్యాటక ప్రాంతాలన్నీ సందర్శకులతో రద్దీగా కనిపించాయి. పర్యాటకుల సంఖ్య పెరగడంతో చిరువ్యాపారాలు కూడా జోరుగా కొనసాగాయి.

ఉత్సాహంగా సెయింటాన్స్ ఫేర్‌వేల్ డే



వేడుకల్లో విద్యార్థినులతో ప్రిన్సిపాల్

గోల్కొండ: మెహిదీపట్నంలోని సెయింటాన్స్ కాలేజ్‌లో శనివారం ఫేర్‌వేల్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ బ్రాంచీల ఫైనల్ ఇయర్ విద్యార్థులు వివిధ రకాల దుస్తులలో ఆడిపాడి సందడి చేశారు. వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ విజయరాణి బహుమతులు, కిరీటాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. అత్యున్నత ప్రమాణాలతో తమ కళాశాల విద్యాబోధన గావిస్తుందన్నారు. మిస్ సెయింటాన్స్‌గా జైనాబ్ ఇక్బాల్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్స్ ఆఫ్ స్కూల్స్ అండ్ కాలేజెస్ సుపిరియల్ జనరల్ మదర్ జనరల్ ఆంథోనమ్మ, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణల కూల్చివేత



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

గోల్కొండ: గుడిమల్కాపూర్‌లో బల్దియా అధికారులు రోడ్డును ఆక్రమించుకొని ఉన్న తోపుడు బండ్లు, హాకర్స్‌ల స్టాల్స్‌ను కూల్చివేశారు. శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ తొలగింపులతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న మజ్లిస్ ఎమ్మెల్యేలు కౌసర్ మోహియుద్దీన్, మహ్మద్ మాజీద్ హుస్సేన్‌లు సంఘటన స్థలానికి చేరుకొని హాకర్స్‌కు మద్దతుగా నిలిచారు. ఎటువంటి హెచ్చరికలు లేకుండా హాకర్స్‌ల బండ్లు, స్టాల్స్‌ను తొలగించడం అన్యాయం అని వారు బల్దియా అధికారులతో చెప్పారు. అయితే రోడ్లను ఆక్రమించి హాకర్స్ వ్యాపారాలు చేసుకుంటున్నారని దీన్ని వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఇది ట్రాఫిక్ జామ్‌కు దారి తీస్తుందని గుడిమల్కాపూర్ పోలీసులు ఎమ్మెల్యేలకు వివరించారు. ఎట్టి పరిస్థితిలోనూ రోడ్లపై వ్యాపారాలను చేయడం కుదరదని ఈ సందర్భంగా బల్దియా అధికారులు స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల మాటలను పట్టించుకోకుండా బల్దియా అధికారులు పోలీసుల సాయంతో ఫుట్‌పాత్‌లపై వెలిసిన ఆక్రమణలను తొలగించారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సరోజినీదేవి

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ రచయిత్రి జ్యోతిర్మయి రూపొందించిన తెలుగు వర్ణమాల బొమ్మల పుస్తకం పిల్లలు తెలుగుభాష నేర్చుకునేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉందని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మోడల్ స్కూల్ సంయుక్త సంచాలకులు పాలడుగు సరోజినీదేవి అన్నారు. శనివారం రవీంద్రభారతిలో జ్యోతిర్మయి తెలుగు గజల్ అకాడమీ ఆధ్వర్యంలో రచయిత్రి ఎం.జ్యోతిర్మయి రచించిన బొమ్మ బొమ్మ నీపేరేమి వర్ణమాల పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలు తెలుగు అక్షరాలను ఆసక్తిగా నేర్చుకునేందుకు రచయిత్రి చేసిన ప్రయత్నం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు శ్రీధర్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత చొక్కాపు వెంకటరమణ, తెలుగు చలన చిత్ర సెన్సార్ బోర్డు సభ్యులు కళారత్న బ్నిం, సాహితీవేత్త బిక్కి కృష్ణ, చిత్రకారులు జంధ్యాల ఉమాదేవి, అబ్దుల్ వాహేద్, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా మజ్లిస్ ఆవిర్భావ దినోత్సవం



మజ్లిస్ జెండాను ఎగరవేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ ప్రజల కోసం ఏర్పడిన పార్టీలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శనివారం మజ్లిస్ పార్టీ 66వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో మజ్లిస్ పతాకావిష్కరణ చేశారు. గోల్కొండ కోట వద్ద ఆయన పార్టీ జెండా ఎగరవేసి మాట్లాడారు. మజ్లిస్ పార్టీ పుట్టుకతోనే సెక్యూలర్ పార్టీగా ఆవిర్భవించిందని, ఇప్పుడు కూడా సెక్యూలర్ భావాలతోనే ముందుకు సాగుతుందన్నారు. మజ్లిస్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, మహ్మద్ హర్షద్, షకీల్ ఆలీఖాన్ తదితరులున్నారు.

5వ తేదీ వరకు రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న గంగాధర్, ధన్‌రాజు, లక్ష్మణ్, ఖాదర్ బిన్ హసన్

నాంపల్లి: ఒకటవ తేదీనే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు వేసినందుకు తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ మేరకు శనివారం నాంపల్లిలోని గృహకల్ప భవన సముదాయంలోని కేంద్ర సంఘం రాష్ట్ర కార్యాలయం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ ఆదేశాల ప్రకారం రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు గంగాధర్ పర్యవేక్షణలో పాలాభిషేకం చేశారు. గంగాధర్ మాట్లాడుతూ..ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేపడుతున్నట్లు చెప్పారు. తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం గౌరవాధ్యక్షులు ఖాదర్ బిన్ హసన్, కోశాధికారి ధన్‌రాజ్, ప్రచార కార్యదర్శి జి.శ్రీనివాస్, నగర శాఖ అధ్యక్షులు లక్ష్మణ్, థామస్ పాల్గొన్నారు.

సందడిగా వార్షికోత్సవం



గన్‌ఫౌండ్రీ: అబిడ్స్‌లోని స్లేట్ ది స్కూల్ ప్రీ ప్రైమరీ చిన్నారుల వార్షికోత్సవ వేడుకలు శనివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటపాటలు, బోనాల వేడుకలు, జానపద నృత్యాలు ఆహుతులను కట్టిపడేశాయి. ఈ కార్యక్రమంలో స్లేట్ ది స్కూల్ చైర్మన్ వాసిరెడ్డి అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్థోపెడిక్ పెయిన్ క్యాంప్



డాక్టర్ సాధన్ పాలకూరి

గోల్కొండ: ఈనెల 3వ తేదీన ఉచిత ఆర్థోపెడిక్ పెయిన్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నామని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ సాధన్ పాలకూరి తెలిపారు. షేక్‌పేట్‌లోని తమ ఆసుపత్రిలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు వైద్య పరీక్షలు చేసుకోవచ్చునని ఆయన సూచించారు. ఈ క్యాంప్‌లో ఉచిత ఆర్థోపెడిక్ కన్సల్టేషన్, ఫ్రీ బీఎండి స్కాన్‌లు ఉచితంగా చేస్తామని ఆయన తెలిపారు. మోకాళ్ల నొప్పి, బ్యాక్, నెక్ పెయిన్, షోల్డర్ పెయిన్‌తో పాటు మస్క్యులర్ పెయిన్‌లకు సరైన సలహాలు, సూచనలు ఇవ్వబడుతాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం 9989346471, 040–29309009లో సంప్రదించవచ్చు.

నేడు పల్స్ పోలియో

గోల్కొండ: నేడు ఈ సంవత్సరపు మొదటి విడత పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నామని గోల్కొండ క్లస్టర్ ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ ఎస్.మురళీధర్ తెలిపారు. శనివారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఆయన పల్స్ పోలియో వివరాలను వెల్లడించారు. నియోజకవర్గంలో మొత్తం 22 వేల మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయడానికి ఏర్పాట్లు జరిగాయని ఆయన అన్నారు. ఇందుకు 200 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసి 800 మంది వ్యాక్సిన్ వేయడానికి సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. వీరికి తోడుగా కార్వాన్, షేక్‌పేట్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సైతం చిన్నారులకు పల్స్ పోలియో వేస్తామన్నారు. ఈ కార్యక్రమం మొత్తం మూడు రోజులు కొనసాగుతుందన్నారు. మొదటి రోజు ఆదివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చిన్నారులకు చుక్కలు వేస్తామని, సోమ, మంగళవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చుక్కలు వేస్తామన్నారు. 4వ రోజు తమ సిబ్బంది ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేసుకోని చిన్నారులను గుర్తించి వారికి సైతం టీకాలు వేస్తామని ఆయన తెలిపారు. గోల్కొండ కోట, సెవల్ టూమ్స్ చౌరస్తా లాంటి పర్యాటక ప్రాంతాల్లో సైతం పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు.

బండి సంజయ్‌పై బీజేపీ చర్యలు తీసుకోవాలి

సుల్తాన్‌బజార్: మంత్రి పొన్నం ప్రభాకర్ మాతృమూర్తిని ఉద్దేశించి పరుష పదజాలంతో మాట్లాడిన బండి సంజయ్‌ను బీజేపీ అధిష్టానం వెంటనే పార్టీ నుంచి బహిష్కరించాలని తెలంగాణ గౌడ సంఘం వ్యవస్థాపకుడు, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావు గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..బండి సంజయ్ మాట్లాడిన మాటలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బండి సంజయ్ బ్లాక్ మేయిలింగ్ వ్యవహారాలన్ని అందరికీ తెలిసినవేనని లక్ష్మణ్‌రావు విమర్శించారు. బీజేపీ బండి సంజయ్‌ను పార్టీ నుంచి బహిష్కరించాలని..లేని పక్షంలో బీజేపీ ఓటమికి బీసీలు ఐక్యంగా పనిచేస్తారని హెచ్చరించారు.

ఆహారం పంపిణీ



ఆహారం పంపిణీ చేస్తున్న ముజీబ్ హుస్సేని తదితరులు

అబిడ్స్: అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ ఆధ్వర్యంలో శనివారం ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రిలో 600 మంది ఇన్‌పేషంట్ అటెండర్లకు ఆహారాన్ని పంపిణీ చేశారు. కుటుంబం, స్నేహితులు, యూనియన్ సభ్యుల మద్దతు లేకుండా ఇలాంటి కార్యక్రమాలు చేయడం అసాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం నాయకులు పర్వతాలు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కె.ఆర్.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు కుర్రాడి శ్రీనివాస్, మహ్మద్ అబ్దుల్ ముజీబ్, సభ్యులు ఖాలీద్ అహ్మద్, బొలిగిద్ద శంకర్, వైదిక్ శాస్త్రి, ఎంఎన్‌జే ఆసుపత్రి యూనిట్ సెక్రెటరి బి.శివకుమార్, కోశాధికారి శేఖర్, జిల్లా ఏపీఆర్‌ఓ మహ్మద్ వహీద్, ముస్తఫా షరీఫ్, రామకృష్ణారెడ్డి, రోహిత్, హబీబ్, చావుష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్వీ షరీఫ్

గన్‌ఫౌండ్రీ: టీఎన్జీఓస్ పాఠశాల విద్యాశాఖ విభాగం ఆధ్వర్యంలో శనివారం గన్‌ఫౌండ్రీలోని డీఈఓ కార్యాలయంలో గ్యార్వీ షరీఫ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ హుస్సేనీ మాట్లాడుతూ.. పండుగలు మత సామరస్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రోహిణి, టీఎన్జీఓస్ పాఠశాల విద్యాశాఖ విభాగం నగర అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్, పెద్దపల్లి డీఈఓ రాము, విద్యాశాఖ అధికారులు శ్రీనివాస్ రెడ్డి, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

సాంప్రదాయ దుస్తులు భేష్

గోల్కొండ: సాంప్రదాయ దుస్తులకు నేటికీ ఆదరణ ఉందని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం సాంప్రదాయ దుస్తుల డే జరిగింది. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ సభ్యులు, శ్రేయోభిలాషులు ముస్లిం సాంప్రదాయ దుస్తులు ధరించారు.

ద్విచక్ర వాహనాల దొంగల అరెస్టు

అఫ్జల్‌గంజ్: ద్విచక్ర వాహనాలను దొంగలిస్తున్న ముగ్గురిని అఫ్జల్‌గంజ్ పోలీసులు అరెస్టు చేసిన ఘటన శనివారం అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎండీ ఇమ్రాన్ (20), అల్లం సురేష్ (40), షేక్ షహబాజ్ (24) కొంత కాలంగా నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాలు దొంగతనం చేస్తున్నారు. ఈ క్రమంలో ఉస్మాన్‌గంజ్ ప్రాంతానికి చెందిన ముఖేష్ తన ద్విచక్ర వాహనం పోయిందని అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టగా ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 4 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.